
# సింగిల్ పేజీ కథలు

## బుద్ధి

**సత్యమూర్తి, వెంకట్రావు చిరకాల మిత్రులు. చదువు పూర్తిచేసుకుని వెంకట్రావు అమెరికా వెళ్ళిపోయాడు. సత్యమూర్తి మన దేశంలోనే వుండిపోయాడు. చాలా ఏళ్ళ తర్వాత మిత్రులిద్దరూ కలుసుకున్నారు. ఇతరులకు విసుగు తెప్పించేటంతగా చిన్ననాటి విషయాలు నెమరు వేసుకుంటున్నారు.**

"అప్పుడే పదకొండైపోతోంది, ఈ రాత్రికి అన్నయ్యగార్ని నిద్దరపోనివ్వరా!" అంటూ వచ్చింది సత్యమూర్తి భార్య.



"మేం సంతోషంగా చిన్ననాటి విషయాలు ముచ్చటించుకుంటూంటే మధ్యలో నీకెందుకే. ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో పడున్నాం. అసలీ వెంకట్రావు మన దేశానికి వచ్చినట్లే తెలీదు నాకు. వీడి అన్నయ్య ధర్మమా అని యిన్నాళ్ళకు కలుసుకున్నాం. నువ్వెళ్ళి నిద్రపో!"

"చూడండి అన్నయ్యగారూ, ఈయనగారు యిదీ వరస. నేనేం మాట్లాడినా పదింతలు మాట్లాడి ఆయన వాక్చాతుర్యం ప్రదర్శిస్తారు."

"వీడిప్పుడే కాదమ్మా, చిన్నప్పట్నుంచీ యిదే వరస. ఎదుటివాళ్ళను మాట్లాడనివ్వడు. వీడ్ని యిక మనవలు తప్ప ఎవరూ ఆపలేరు."

మళ్ళీ మొదలైంది మిత్రుల సంభాషణ.

"అరే మూర్తీ! నీకు జ్ఞాపకం వుందా, మన కాలేజీ దగ్గర్లో ఒక పాడుపడిన పెద్ద మేడ వుండేది. నువ్వు ఆ మేడ పాడుపడిన తలుపుల్ని, రాయి తీసుకుని క్రికెట్ బాల్ బౌలింగ్ చేస్తున్నట్లు గట్టిగా కొట్టేవాడవు. ఒకసారి మన క్లాస్‌మేట్ చేత "ఏంకాదు! మీరు కూడా ఈ రాయి తీసుకుని గట్టిగా కొట్టండి" అని అతనిచేత కూడా కొట్టించావు. పాపం అతని దురదృష్టం. లోపల్నుంచి వాచ్‌మన్ వచ్చి అతన్ని "ఇందాకట్నుంచి చూస్తున్నా! ఏదోలే కుర్రాళ్ళు కదా అని వూరుకుంటే, అదే పనిగా రాళ్ళు వేసి కొడతారా" అంటూ చడామడా తిట్టాడు" అన్నాడు వెంకట్రావు.

ఈ మాటలు విన్న శ్రీమతి మూర్తి "అబ్బో! అలా ఎదుటివాళ్ళని యిరికించడంలో పెద్ద దిట్ట మీ మిత్రుడు. జీవితంలో బయటపడలేని ఈ సంసారంలో నన్ను కూడా యిరికించారు" అంది.

"బాగుంది. ఈ వెంకట్రావుగాడు నామీద వున్నవీ లేనివీ చెప్పడం, నువ్వేమో వీడికి వంతపాడడం. చాలు యిక పడుకో"

"మెళుకువగా వుంటే మీ చిన్ననాటి కృష్ణలీలలు విని సంతోషిద్దామని యిక్కడే కూర్చున్నాను" అంది శ్రీమతి మూర్తి.

"సర్లే.. గొప్పేలే! నువ్వు తెలివైనదానివని ఈపాటికి మా వెంకట్రావుగాడికి అర్థమైపోయుంటుందిలే! నువ్వు పొద్దున్న అయిదు గంటలకల్లా మాకు కాఫీ యివ్వాలి. పొద్దున్నే టీవీలో వచ్చే ఆరాధనా కార్యక్రమాలు చూస్తాంమేం"

శ్రీమతి మూర్తి నిద్రకుపక్రమించింది.

"అరే! మన తెలుగు లెక్చరర్ భాస్కరశర్మగారిప్పుడు ఎక్కడ వున్నారో, తర్వాత ఆయన డాక్టరేట్ చేశారని విన్నాను" అన్నాడు వెంకట్రావు.

"ఆయన ఢిల్లీలో వాళ్ళబ్బాయి దగ్గర వున్నారట."

"మన క్లాస్‌మేట్ హార్లిక్స్ సీసా అన్న నిక్‌నేమ్‌తో ఒకడుండేవాడు. ఎప్పుడూ తిన్నగా కాలేజీకి వచ్చేవాడు కాదు. భాస్కర్‌శర్మగారు చిన్నయసూరి వ్యాకరణం చెపుతూంటే పెద్ద చదువుమీద ఆసక్తి వున్నవాడిలా లేచి నిలబడి "మాస్టారూ! అరసున్నా ఎప్పుడు వస్తుంది, నిండుసున్నా ఎప్పుడు వస్తుంది?" అని అడిగాడు. అప్పుడు మాస్టారు 'నాయనా! యిలా చదివితే అరసున్నా, యింతకన్న బాగా చదివితే నిండుసున్నా వస్తుంది' అన్నారు. క్లాసంతా ఘొల్లుమని ఒకటే గోల చేశారు" అంటూ వెంకట్రావు నవ్వుతూ చెప్పాడు.

"అయ్యో! ఈ జోక్ ఎలా మరుస్తానురా? ఆ తర్వాతే కదా వాడి నిక్‌నేమ్ నిండుహార్లిక్స్ సీసా అని మార్చాం" అన్నాడు మూర్తి.

"ఈ జోక్ అమెరికాలోని మన తెలుగువాళ్ళకి చెపితే పగలబడి నవ్వేవారురా!"

అలా మాట్లాడుకుంటూ యిద్దరూ, నిద్రాదేవి ఒడిలోకి వాలిపోయారు.

తెల్లారకట్ల ఏదో చప్పుడైంది. మంచి నిద్రలోనున్న మూర్తి, పిల్లి అయివుంటుందని లేవలేదు.

తెల్లారకట్ల నాలుగున్నరకి లేచారు. కాఫీ తాగి టీవీ పెడదామని రిమోట్ నొక్కాడు మూర్తి. టీవీ ఆన్ కాలేదు. దగ్గరకి వెళ్ళి బటన్ నొక్కాడు. 'చైల్డ్‌లాక్ ఆన్' అని కనిపించింది. చైల్డ్‌లాక్ తీద్దామని రిమోట్‌తో ప్రయత్నం చేశాడు. రిమోట్ పనిచెయ్యలేదు.

"ఆ రిమోట్‌లో బ్యాటరీలు సరిగ్గా వున్నాయో లేదో చూడరా మూర్తీ" అన్నాడు వెంకట్రావు.

ఆ రిమోట్ తెరిచి చూస్తే అందులో అసలు బ్యాటరీలే లేవు.

మనవడ్ని లేపి "ఏమిట్రా చైల్డ్‌లాక్ చేశావా?" అని

అడిగాడు.

వాడు మహాగడసరి "మీకంటే ముందే పడుకున్నాను కదా తాతా!" అన్నాడు.

"అది సరే! ఈ రిమోట్‌లో వున్న బ్యాటరీలు ఏమయ్యాయి?"

"తెల్లారకట్ల ఏదో చప్పుడైంది. ఏ పిల్లి అయినా ఎత్తుకుపోయిందేమో తాతా"

ఒకసారి రిమోట్ దాచేసి ఏదో పిల్లి ఎత్తుకుపోయిందన్నాడు మూర్తి. 'వీడు సరైన సమయం చూసి కొట్టాడు దెబ్బ. బ్యాటరీలు దాచేసి వుంటాడు' అనుకున్నాడు మూర్తి.

ఆ చైల్డ్‌లాక్ మిత్రుల్ని వెక్కిరించింది. భక్తి కార్యక్రమాలు హుళక్కి అయిపోయాయి.

ఇదంతా చూసిన శ్రీమతి మూర్తి "వీడివన్నీ వాళ్ళతాత బుద్ధులే అన్నయ్యగారూ!" అంది.

"ఔనమ్మా కరెక్టుగా చెప్పావ్. ఈ మూర్తిగాడు కూడా చిన్నప్పుడు మా పుస్తకాలు, పెన్నులూ దాచేసి మమ్మల్ని ఏడిపించేవాడు. అందుకే దేవుడు బ్యాటరీలు దాచేసే మనవడ్ని యిచ్చాడు. రిమోట్ పనిచెయ్యకపోతే చైల్డ్‌లాక్ తియ్యలేరని మీ మనవడికి తెలుసు. తాతకి దగ్గులు నేర్పే మనవడు వీడు" అంటూ ఒక వంద రూపాయల నోటు వాడి చేతిలో పెట్టాడు వెంకట్రావు.

"మీ మిత్రుడు గురించి యిటువంటి విషయాలు తెలుస్తాయనే, చాలాసేపు మెళుకువగా వున్నాను నిన్న రాత్రి అన్నయ్యగారూ!" అంది మూర్తి భార్య చిరునవ్వుతో, మగనికేసి చూస్తూ.

"ఇదుగో తాతా! ఈ డబ్బుపెట్టి కొత్తబ్యాటరీలు కొనుక్కో" అంటూ మనవడు మూర్తికి యిచ్చాడు ఆ డబ్బు.

**-భమిడిపాటి సోమయాజి (హైదరాబాద్)**

# మానవత్వం

**హెడ్‌మాస్టరుగారు పిలుస్తున్నారని ప్యూన్ వచ్చి పిలవడంతో అభినయకి వళ్ళంతా చమటలు పట్టేసాయి.**

ఎప్పుడు చూసినా సీరియస్‌గా, ఎంతో అవసరం అయితే తప్ప పెదవి విప్పి మాట్లాడని హెడ్‌మాస్టారంటే స్కూల్‌లో విద్యార్థులందరికీ ఎంతో భయం. తీక్షణమైన ఆయన కంటిచూపుకే అందరూ వణికిపోతూంటారు.

ఎప్పుడూ లేనిది ఈరోజు నన్నెందుకు పిలిచారు? కొంపదీసి యిందాక ప్రేయర్ సమయంలో సుజాతతో ఇంగ్లీషు నోట్సు గురించి మాట్లాడడం చూసేసారేమో. అయినా తన బుద్ధి తక్కువతనం కాకపోతే ఆయన సంగతి తెలిసి కూడా అప్పుడే మాట్లాడాలా?

'ఏమాట వినాల్సివస్తుందో' అనుకుంటూ భయం భయంగా ఆఫీసు రూమ్‌లోకి అడుగుపెట్టింది.

ఒకసారి కళ్లద్దాల్లోంచి సీరియస్‌గా చూసి "నీ పేరు అభినయ కదూ!" అడిగారు హెడ్మాస్టర్.

అవునన్నట్లు టకటకా తల ఆడించింది.

"క్లాస్ సిక్స్, సెవెన్త్‌లో నువ్వు మొత్తం స్కూలికే ఫస్ట్ వచ్చావు కదా! అలాగే ఈ సంవత్సరం కూడా ఫస్ట్ నీకే వచ్చింది. అయితే ప్రతీ సంవత్సరంలా కాకుండా, గవర్నమెంట్‌వారు ఈ సంవత్సరం నుంచి ఫస్ట్, సెకండ్ వచ్చినవారికి ప్రైజ్‌మనీ యిస్తున్నారు. ముందు నువ్వు ఈ రిజిష్టర్‌లో సంతకం పెట్టు" అంటూ రిజిష్టర్ అందించారు.

సంతకం పెడుతున్నప్పుడు అభినయ చేతులు ఉద్వేగంతో చిన్నగా వణికాయి. గుండెలో ఆనందం పరవళ్ళు తొక్కుతున్నది.

సంతకం చూసి, అయిదువందల రూపాయలు అభినయ చేతిలో పెట్టారు హెడ్మాస్టరు.

ఆఫీసు రూమ్‌నుంచి క్లాస్‌రూమ్ వరకు గాల్లో తేలుతున్నట్లు నడుచుకుంటూ వెళ్ళింది. ఈ మధ్యలో చేతిలోని నోట్ల వంక ఎన్నిసార్లు అపురూపంగా చూసుకుందో లెక్కేలేదు. విషయం విని ఫ్రెండ్స్ అంతా అభినందించారు. కొంతమంది ఈర్ష్యగా చూసారు. 'ఎప్పుడూ యిలాగే ఫస్ట్ రావాలని' క్లాస్ టీచరు దీవించారు అభినయని.

* * *

"నాన్నగారూ! జీవితంలో ప్రతీ పరీక్షలో ప్రథమస్థానంలో నిలిచి, ఒక మంచి కార్డియాలజిస్టుగా పేరు తెచ్చుకోవాలన్న నా లక్ష్యం నెరవేరాలని దీవించండి. సరియైన సమయంలో ట్రీట్‌మెంట్ అందక మీరు మాకు శాశ్వతంగా దూరం అయ్యారు. అది ఎప్పటికీ మాకు తీరని లోటు. నేనొక డాక్టర్నై వీలైనంతమందికి నా సేవలు అందించాలన్న నా ఆశయాన్ని నెరవేర్చండి నాన్నగారూ!"

అయిదు వందలు తండ్రి ఫొటో ముందుంచి మౌనంగా ప్రార్థించింది.

తండ్రి ఫొటో ముందు మౌనంగా నిల్చున్న అభినయని చూసేసరికి శారద మనస్సు భారంగా అయిపోయింది.

'పిచ్చిపిల్ల.. ఈ వయస్సులో పిల్లలు సినిమాలని, షికార్లని సరదాగా తిరుగుతూంటే, తన లక్ష్యమే తనకు ముఖ్యమని యిలాంటి తాత్కాలిక ఆనందాలన్నింటికీ దూరంగా వుండడం అలవాటు చేసుకుంది. ఎప్పుడు చూసినా చదువు, చదువు...అంతే.'

క్లాస్ పుస్తకాలే కాదు, తన టీచర్ల సలహాతో మంచి మంచి పుస్తకాలు కొని చదవడం అలవాటు చేసుకుంది.

"అభీ! పరీక్షలు అయిపోయాయి కదమ్మా, చక్కగా ఫ్రెండ్స్‌తో కలిసి ఏదైనా సినిమాకి వెళ్ళొచ్చు కదా!" అంటే, "రెండుమూడు గంటలు ఆ సినిమాని చూడడం కన్నా, హాయిగా వాకిట్లో కుర్చీలో కూర్చుని మంచి మంచి పుస్తకాలు చదువుకోవడమే నాకు బాగుంటుందమ్మా!" అంటూ హాయిగా నవ్వేస్తుంది. తన మానసిక పరిణతిని చూస్తుంటే ముచ్చటగా వుంటుంది. ఆయన బ్రతికుంటే తన కూతుర్ని చూసుకుని ఎంత మురిసిపోయేవారో.. ప్చ్.. అదృష్టం లేకుండా అయిపోయింది.

"ఏంటమ్మా అలా నిలబడి ఆలోచిస్తున్నావు?" అభినయ మాటలతో తేరుకుని, తన ఫీలింగ్స్‌ని చిరునవ్వు వెనుక దాచేసి-

"అభీ! ప్రతీ సంవత్సరం నీకు వచ్చిన ప్రైజ్‌లను దాచివుంచుతున్నాము కదా! అలాగే ఈ సంవత్సరం వచ్చిన డబ్బుల్తో ఏదైనా వస్తువు కొని వుంచుకుంటే బాగుంటుందని నాకు అనిపిస్తున్నాది. ఇందాక ఎదురింటి రాధా ఆంటీ వచ్చి, శ్రీలక్ష్మి జ్యూయలర్స్ వారు డిస్కౌంట్ యిస్తున్నారని చెప్పింది. నీ కాళ్లకి పట్టీలు కొందామని అనుకుంటున్నాము కదా! అదేదో నీకొచ్చిన డబ్బుల్తో అయితే నీకూ సరదాగా వుంటుంది కదా! ఎందుకైనా మంచిది, ఒకసారి పేపరు తీసి వివరాలు చదువు. నేనింతలో చారు పోపుపెట్టి వస్తాను" వంటింట్లోకి వెళ్ళింది శారద.

టీపాయ్ మీదవున్న పేపరు తీసుకుని, పేజీలు తిరగేసింది. అప్రయత్నంగా మూడోపేజీలోని న్యూస్ దగ్గర అభినయ చూపులు నిలిచిపోయాయి. జాగ్రత్తగా రెండుసార్లు చదివింది. తన కర్తవ్యం బోధపడింది.

* * *

గౌరవనీయులైన శ్యామలగారికి,

పేపర్లో దాతల నుంచి సహాయాన్ని అర్థిస్తూ మీరిచ్చిన ప్రకటన చదివాను. పదేళ్ళ మీ పాపకి వెంటనే హార్ట్ ఆపరేషన్ చెయ్యాలని చెప్పారు. ఒక ప్రాణం విలువ ఏమిటో, తండ్రిని కోల్పోయిన నాకు బాగా తెలుసు. అలాంటి దుస్థితి మీకు కలుగకూడదని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. నాకు వచ్చిన ప్రైజ్‌మనీ అయిదువందలు, నేను దాచుకున్న రెండువేల రూపాయలతోపాటూ, మా స్కూల్ పిల్లల దగ్గర నుంచి, మా చుట్టుప్రక్కల వారినుంచి నేను సేకరించిన ఎనిమిది వేల అయిదువందలు మొత్తం పదివేల రూపాయలకి డి.డి.ని తీసుకుని పంపిస్తున్నాను. మీ పాపకి త్వరలోనే ఆపరేషన్‌కి కావలసిన మిగతా మొత్తం కూడా సమకూడి, ఆపరేషన్ విజయవంతం కావాలని మేమంతా కోరుకుంటున్నాము.

ఇట్లు,
అభినయ.

పూర్తిచేసిన లెటర్‌ని కవర్‌లోపెట్టి, జిగురు అంటించింది. "అమ్మా! పోస్టాఫీసుకి వెళ్ళివస్తాను" అని చెప్పి బయటకు వెళ్తున్న అభినయని చూస్తుంటే శారద మనస్సులో ఎంతో ఆనందం. 'తన కూతురు కేవలం చదువుల్లోనే కాదు, మానవత్వం చూపించడంలో కూడా ఫస్టే' అనుకుంది తృప్తిగా.

**-డి.స్వర్ణశైలజ (ఖరగ్‌పూర్)**